డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 31: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్ డబ్ల్యూ కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్, మేకప్ పరీక్ష ఫీజును ఈనెల 12వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 19వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్ష జవాబు పత్రాల నకలుకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 31: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని ఫ్యాకల్టీల పరిధిలోని అన్ని విభాగాల ప్రీ పీహెచ్‌డీ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీ పీహెచ్‌డీ కోర్స్ వర్క్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పురుషోత్తం సేవలు అద్వితీయం

● డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య

కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ తిప్పర్తి యాదయ్య

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 31: ఓయూ ఎకానమిక్స్ విభాగం అధ్యాపకులు, ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం సమాజానికి అందించిన సేవలు అద్వితీయమని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య కొనియాడారు. పురుషోత్తం పదవీ విరమణ సభను ఓయూ ఆర్ట్స్ కళాశాల రూం నంబర్ 133లో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యాదయ్య హాజరై మాట్లాడుతూ అట్టడుగు కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి, అత్యున్నత మనిషిగా ఎదిగి, ప్రజల జీవన విధాన మార్పు కోసం నిరంతరం శ్రమించారని ప్రశంసించారు. ఆ విలువైన పూర్తి సమయాన్ని సమాజసేవే అంకితం చేయాలని కోరారు. ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ విద్యార్థి నేతగా, ఆర్టీసీ కార్మిక నేతగా, తెలంగాణ ఉద్యమకారునిగా, దళిత మేధావిగా, ఆర్థికవేత్తగా, సామాజిక విశ్లేషకునిగా సేవలందించడం పురుషోత్తంకే సాధ్యమని అన్నారు. సులువైన గ్రామీణ పేదల భాషలో మాట్లాడగల నేర్పు, వారి భాషలోనే రాయగలిగే తీరు ఆయనకు మాత్రమే సొంతమని చెప్పారు. కార్యక్రమంలో పసునూరి దయాకర్, ప్రొఫెసర్లు మల్లేశం, రాములు, డైసీ, లింబాద్రి, అర్జున్‌రావు, జహంగీర్, వంశీధర్, డాక్టర్ దుబ్బ రంజిత్, వివిధ సంఘాల నాయకులు జైభీమ్ తిరుపతి, యుగేంధర్, వలిగొండ నరసింహ, చనగాని దయాకర్, పాల్వాయి నగేశ్, ఆర్ఎన్ శంకర్, ఆంజనేయులు, నలిగంటి శరత్, వరంగల్ రవి తదితరులు పాల్గొన్నారు.

మధుకుమార్ సేవలు అభినందనీయం

వినియోగదారుల కమిషన్ సూపరింటెండెంట్ పదవీ విరమణలో కొనియాడిన పలువురు ఉద్యోగులు

సూపరింటెండెంట్ మధుకుమార్, మహబూబ్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి ఇందిర దంపతులను సత్కరిస్తున్న స్టేట్ కమిషన్ రిజిస్ట్రార్ రామ్‌కుమార్, తదితరులు

సుల్తాన్‌బజార్, ఆగస్టు 31: హైదరాబాద్ వినియోగదారుల కమిషన్-1 సూపరింటెండెంట్ కె.మధుకుమార్ సేవలు అభినందనీయమని పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు. శనివారం సూపరింటెండెంట్ మధుకుమార్ పదవీ విరమణ వేడుకలు నాంపల్లిలోని కమిషన్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ మేరకు పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా మధుకుమార్, ఆయన సతీమణి మహబూబ్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి ఇందిరను శాలువా, మొమెంటోతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల స్టేట్ కమిషన్ ఇన్‌చార్జి ప్రెసిడెంట్ మీనా రామనాథన్, సభ్యులు ఆర్ఎస్ రాజశ్రీ, వీవీ శేషుబాబు, జిల్లా కమిషన్ అధ్యక్షుడు వక్కం టి నరసింహారావు, సీహెచ్ లలిత కుమారి, రాంగోపాల్‌రెడ్డి, బి.ఉమాసుబ్బలక్ష్మి, సభ్యులు జవహర్ బాబు, జనార్దన్ రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీదేవి, శ్యామల, మాధవి లత, మాధవి, స్టేట్ కమిషన్ రిజిస్ట్రార్ రామ్‌కుమార్, రాజిరెడ్డి, తిరుమల రావు, వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 31: తార్నాక, హబ్సిగూడ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారిందని బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల్లో ఈ రోడ్డుపై జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు విద్యార్థినులు మృతి చెందారని గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యానికి వ్యతిరేకంగా బీజేపీ ఆధ్వర్యంలో తార్నాక చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారీ వాహనాలకు రాత్రి సమయాల్లో కాకుండా పగలు అనుమతి ఉండదని చెప్పారు. అలాంటపుడు లారీలు నగరంలోకి ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. దీనిని నియంత్రించాల్సిన పోలీసులు చేష్టలుడిగి చూస్తున్నారని ఆరోపించారు. అతి వేగంతో వచ్చిన లారీలే ముక్కుపచ్చలారని ఇద్దరు చిన్నారుల ప్రాణాలు తీశాయన్నారు. తక్షణమే ప్రభుత్వ యంత్రాంగం మేల్కొని ప్రమాదాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

తార్నాక చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

మనస్తాపంతో మెడికల్ విద్యార్థి ఆత్మహత్య

కాచిగూడ, ఆగస్టు 31: మనస్తాపంతో మెడికల్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. ఎస్సై సురేశ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. కాచిగూడ వీఎన్ఆర్ కాంప్లెక్స్‌కు చెందిన కోట బాలాజీ(21)హిమాయత్‌నగర్‌లో డీఎంఎల్‌టీ చేస్తూ, కాచిగూడలోని త్రివేణి లాడ్జిలో పనిచేస్తున్నాడు. కొన్నేళ్లుగా బాలాజీకి మానసిక పరిస్థితి భాగలేదు. దీంతో శనివారం ఉదయం మనస్తాపంతో త్రివేణి లాడ్జిలో ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన

ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది

అమీర్‌పేట్, ఆగస్టు 31: క్లినోసోల్ ఇనిస్టిట్యూట్, బృహత్ ఆయుర్వేద ఆసుపత్రి సంయుక్తాధ్వర్యంలో బృహత్ ఆసుపత్రి వార్షికోత్సవం సందర్భంగా అమీర్‌పేట్‌లోని క్లినోసోల్ ఇనిస్టిట్యూట్‌లో శనివారం ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల వారు సుమారు 340 మంది ప్రజలు వైద్యశిబిరానికి హాజరయ్యారు. వివిధ రుగ్మతలకు చికిత్స చేయించుకున్నారు. బృహత్ ఆయుర్వేద చీఫ్ ఫిజీషియన్ డాక్టర్ సత్యసాయి మాట్లాడుతూ పేదల ఆరోగ్య సంరక్షణ కోసం తాము ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే ఆయుర్వేద విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు జయచంద్రారెడ్డి, కౌషిక్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన

సెయింట్ జోసఫ్ పాఠశాలలో తిరుమలగిరి ఏసీపీ రమేశ్‌ను శాలువాతో సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ జోసఫ్

బొల్లారం, ఆగస్టు 31: యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తిరుమలగిరి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) రమేశ్ అన్నారు. శనివారం తిరుమలగిరి లాల్‌బజార్ సెయింట్ జోసఫ్ పాఠశాలలో తిరుమలగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుతో కలిసి డ్రగ్స్, సైబర్ నేరాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ చెడు మార్గంలో నడిపించే డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, చదువుపై శ్రద్ధ పెట్టాలని అన్నారు. చదువుతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జోసఫ్, ట్రస్ట్ కోఆర్డినేటర్ శ్రీకాంత్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్యం

రవీంద్రభారతి, ఆగస్టు 31: భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, శంకరానంద కళాక్షేత్రం, తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తామ్రపాత్రలైవ్ అన్నమయ్య కవితా సౌందర్యంపై ప్రత్యేక శాస్త్రీయ నృత్య ప్రదర్శన శనివారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. ఐదుగురు ప్రముఖ నృత్యగురువులు ఆనంద శంకర్ జయంత్, అనుపమకైలాస్, దీపికారెడ్డి, గోపికవర్మ, వియాభా అరేకర్ ప్రదర్శన ఆకట్టుకున్నది. ముఖ్యఅతిథిగా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి అన్నమయ్య కవితా సౌందర్యంపై శాస్త్రీయ నృత్య ప్రదర్శనను ప్రారంభించారు. ప్రముఖ భరత నాట్యకారిణి ఆనంద ఆలవేలుమంగ, వెంకటేశ్వరుల సమాగమాన్ని వర్ణించే సంకీర్తన ద్వారా ప్రేక్షకులను మైమరిపించారు.

అన్నివర్గాలను భాగస్వామ్యం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న మేకల సారంగపాణి

అడ్డగుట్ట, ఆగస్టు 31: అన్నివర్గాల ప్రజలను పార్టీలో భాగస్వాములు చేయాలని బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగాపాణి అన్నారు. శనివారం బీజేపీ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు సీహెచ్ కన్నాభిరాం ఆధ్వర్యంలో తుకారాంగేట్ కొండారెడ్డినగర్‌లో పార్టీ సభ్యత్వ నమోదుపై చర్చించారు. ముఖ్యఅతిథిగా మేకల సారంగపాణి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదును ప్రతి నాయకుడు, కార్యకర్త బూత్‌స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ సభ్యులుగా చేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్, కృష్ణ, నర్సింగారావు, సాయిబాబా, రవీందర్, మహేందర్, వేణుగోపాల్, ఉదయ్‌కుమార్, హంసరాజు, శివాజీ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

నెక్లెస్ రోడ్డులో విద్యార్థుల కవాత్తు

నెక్లెస్ రోడ్డులో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బేగంపేట్, ఆగస్టు 31: బాల్య విద్యలో మార్గదర్శకులు, ప్రపంచవ్యాప్తంగా పాఠశాలలు అనుసరించే సూత్రాలకు ఆధ్యులు ఇటాలియన్ వైద్యురాలు, విద్యావేత్త డాక్టర్ మాంటిస్సోరి 154వ జయంతి సందర్భంగా శనివారం చిన్నారులు నెక్లెస్ రోడ్డులోని సంజీవయ్య పార్కు వద్ద కవాత్తు నిర్వహించారు. మాంటిస్సోరి శిక్షణ, రీసెర్చ్ ట్రస్ట్ సహకారంతో అంథియా మాంటిస్సోరి ఆధ్వర్యంలో ఈ వాక్ జరిగింది. టీచ్ బై టీచింగ్ నాట్ కరెక్టింగ్, శాంతికి విద్య మంచి ఆయుధం, సమాజ అభ్యున్నతికి చిన్ననాటి విద్య మంచికీ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా అంథియా మాంటిస్సోరి మాట్లాడుతూ మహిళలపై వివక్ష కొనసాగే 19వ శతాబ్దం చివరలో విద్యా విధానాన్ని అభివృద్ధి చేసిందని అన్నారు. వారి జ్ఞాపకార్థం వాక్ నిర్వహించారు. నగరంలోని 21 పాఠశాలలకు చెందిన దాదాపు మూడు వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు సవరణపై బీఎల్ ఓలకు శిక్షణ

అంబర్‌పేట, ఆగస్టు 31 : అంబర్‌పేట నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల ప్రత్యేక సవరణ కార్యక్రమంపై బీఎల్ఓలకు ఒకరోజు శిక్షణను శనివారం స్థానిక మహారాణాప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. నియోజకవర్గంలోని 236 పోలింగ్ బూత్‌లకు చెందిన బీఎల్ఓలు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీ మారుతీదివాకర్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి బీఎల్ఓలు తమ పరిధిలోని బూత్‌లలో ఇంటింటికి వెళ్లి ప్రత్యేక యాప్‌లో ఓటర్ల వివరాలను పరిశీలించాలన్నారు. యాప్‌లోనే కొత్త ఓటర్లను నమోదు చేయడం, చనిపోయినవారు, అడ్రస్‌లో పూర్తిగా లేనివారి పేర్లను తొలగించడం, చిరునామా మార్పు, తదితర అంశాలను బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు.

వేర్వురు ఘటనల్లో ఇద్దరు మృతి

మారేడ్‌పల్లి, ఆగస్టు 31: పట్టాలు దాటుతుండగా ఓ వ్యక్తిని రైలు ఢీ కొట్టడడంతో అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం మల్కాజ్‌గిరిలోని వసంత పూరికాలనీకి చెందిన పెరుమాండ్ల నర్సింహారావు (63) శనివారం ఉదయం 7 గంటల సమయంలో మౌలాలి-లాలాగూడ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ ఢీ కొట్టడడంతో మృతి చెందాడు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో సంఘటనలో..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లోని ప్లాట్ ఫారం నంబర్-1లో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒకటో నంబర్ ప్లాట్ ఫారం ఫుట్ ఓవర్ బ్రిడ్జి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి దుస్తువులను బట్టి సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నట్లు తెలుస్తుందన్నారు. అతని చొక్కాపై ఉన్న నంబర్ జీఎస్ఎస్ అని మాత్రమే కనిపిస్తుందని, అతను ఏ కంపెనీకి చెందిన సెక్యూరిటీ గార్డు స్పష్టంగా లేదని పోలీసులు చెప్పారు. మృతుడి వయసు సుమా రు40-45 ఏండ్లు ఉంటాయని, ఒంటిపై స్కై బ్లూ కలర్ చొక్కా, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు వెల్లడించారు.

జాబ్ మేళాకు స్పందన

కార్వాన్, ఆగస్టు 31: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధి తోపాటు ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. కార్వాన్ మొఘల్ కా నాలా రోడ్‌లోని మహబూబ్ ప్లైడ్ ఫంక్షన్ హాల్లో నిరుద్యోగులకు ఎంఐఎం -ఏఎంపీ సంస్థ సహకారంతో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. నిరుద్యోగుల నుంచి విశేష స్పందన వచ్చింది. పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి.. వారిని ఆదుకునేందుకు తమవంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు.

మహిళా క్యాంటీన్ ప్రారంభించిన డిప్యూటీ మేయర్


మహిళా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 31: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి పథకంలో భాగంగా తార్నాక డివిజన్‌లోని లాలాపేటలో ఏర్పాటు చేసిన మహిళా క్యాంటీన్‌ను జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఐదు సంవత్సరాల్లో మహిళలను కోటిశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపట్టిందన్నారు. మహిళా శక్తి స్కీం మహిళల ఆర్థిక శక్తివంతం కోసం కీలకంగా పనిచేస్తుందని, ఈ క్యాంటీన్ మహిళల స్వయం ఉపాధికి ముఖ్యమైన మద్దతుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీపీఓ శ్రీనాథ్, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి, శ్రీవాణి మహిళా స్వయం సహాక సంఘాల సభ్యులు, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్య భావాలు పెంపొందించాలి

ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయిస్టర్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ సింగాడే

సుల్తాన్‌బజార్,ఆగస్టు 31: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నైపుణ్య భావాలు పెంపొందించడం ప్రధానమని, విద్యతోపాటు అన్ని కళల్లో ప్రావీణ్యం పొందాలన్నదే ఆయిస్టర్ సంస్థ ఆధ్వర్యంలో వీకెండ్ విస్డమ్, విజ్ఞాన్ 2కే24 కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ సింగాడే పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ డీఈవో సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు స్కిల్ సెట్స్, లైఫ్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, తదితర అంశాల తరగతులతోపాటు క్విజ్ స్పెల్ బీ, వ్యాసరచన, చిత్రకళ, కెరీర్ గైడెన్స్ తదితర పోటీలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని అన్నా రు. ఈ వీకెండ్ విస్డమ్ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌లుగా భువ న, హర్షిణి, ఆకాష్, ఐశ్వర్య, రిషి ఖ, అనన్య, శ్రావణి, అక్షిత, గోపి లు వ్యవహరిస్తున్నట్లు ఆయన వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కోటేశ్వర్ రావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పరంజ్యోతి, ఆయిస్టర్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సొహైల్, ఆయిస్టర్ మంత్రిత్వశాఖల సభ్యులు అరవింద్, శ్రావణి, కిరణ్, నిజాం కళాశాల యూ నిట్ సభ్యులు, మహిళా విశ్వవిద్యాల యం యూనిట్ సభ్యులు విజయ, రా జు, తనిష్క తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్

మహాత్మాగాంధీ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొ ఫెసర్ గోపాల్ రెడ్డి

సమావవేలో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

చిక్కడపల్లి, ఆగస్టు 31: విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి పట్టుదలతో కృషిచేస్తే తప్పకుండా విజయం సాధిస్తారని మహాత్మాగాంధీ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొ ఫెసర్ గోపాల్ రెడ్డి అన్నారు. అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో గ్రాడ్యూయేషన్ సెరమని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గోపాల్ రెడ్డి.. విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కృష్ణం రాజు, ప్రముఖ పర్యావరణవేత్త ఠాకూర్ రేష్మాసింగ్, అవంతి విద్యాసంస్థల జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.ప్రియాంక,అధ్యక్షుడు ఎం.జ్ఞానేశ్వరి, శ్రవణ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.ఎస్. ఎస్.నందీష్, హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై.జయప్రద, డాక్టర్ వెంకట్‌రావు, ప్రిన్సిపాల్ పి.వీరసామయ్య పాల్గొన్నారు.

రాఖీ కట్టేందుకు వచ్చి మహిళ అదృశ్యం


లీలాదేవి

మారేడ్‌పల్లి, ఆగస్టు 31: మహిళ అదృశ్యమైన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం రాజస్థాన్ రాష్ట్రంలోని పాలికి చెందిన లీలాదేవి (35) నగరంలోని చింతల్ మధురానగర్‌లో నివాసం ఉంటున్న తన సోదరుడు దేవేందర్ చౌదరికి రాఖీ కట్టేందుకు ఈనెల 25న నగరానికి వచ్చింది. అనంతరం తిరిగి రాజస్థాన్‌కు వెళ్లేందుకు 27న తన సోదరి లీలాదేవిని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఏడో నంబర్ ప్లాట్ ఫారంపై హిసార్స్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కించిన సోదరుడు దేవేందర్ చౌదరి ఇంటికి వెళ్లిపోయాడు. రెండు రోజులైనా లీలాదేవి రాజస్థాన్‌లోని తన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు దేవేందర్‌కు సమాచారం అందించారు. ఆమె ఆచూకీ కోసం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించలేదు. వెంటనే సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ, ఆగస్టు 31: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ చి మ్నానాయక్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (55) శనివారం బుద్వేల్-ఉందానగర్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కాకి ప్యాంట్, బూడిద రంగు టీషర్ట్ ధరించి, ఎత్తు 5.3 ఉన్నాడని, వివరాలకు 87125 68495 లో సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ..

కాచిగూడ: పట్టాలు దాటుతుండగా రైలుఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మక్సూద్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(40) శుక్రవారం ఉప్పుగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-2లో పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. రైల్వే పోలీసులు ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.